నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I హైదరాబాద్, మంగళవారం 29 ఏప్రిల్ 2025 SANGAREDDY


## వరంగల్ సభ విజయవంతం

- బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి



మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 28 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభ విజయవంతమైందని, ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని, జిల్లా నుంచి భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సోమవారం కృతజ్ఞతలు తెలియజేశారు. సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకులకు, బీఆర్ఎస్ శ్రేణులకు, ప్రజలకు మంచి సందేశాన్ని, ధైర్యాన్ని కల్పిస్తూ ప్రసంగాన్ని కొనసాగించారని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ సభకు లక్షలాది మంది గులాబీ సైనికులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చారని, ప్రతి కార్యకర్తకు హృదయపూర్వక ధన్యనాదాలు తెలియజేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.



# పరిశ్రమకు పవర్ పరేషాన్!

- గంటలకొద్దీ విద్యుత్ కోతలతో ఉత్పత్తికి అంతరాయం
- మరమ్మతుల పేరుతో తరుచూ పవర్ సరఫరా నిలిపివేత
- జనరేటర్లు కొంటున్న పరిశ్రమలు
- విద్యుత్ యూనిట్ ధర రూ. 8
- జనరేటర్లతో విద్యుత్ ఉత్పత్తి యూనిట్ ధర రూ. 20
- ఇండస్ట్రీస్‌పై ప్రభావం చూపుతున్న అప్రకటిత కోతలు
- ఇస్నాపూర్ సబ్ డివిజన్ పరిధిలో 358 పరిశ్రమలపై ప్రభావం
- కార్మికుల డ్యూటీలకు ఎసరు
- మళ్లీ పాతరోజులు పునరావృతం



పాశమైలారంలో ఓ పరిశ్రమ ఆరుబయట బిగించుకున్న జనరేటర్



ఇస్నాపూర్‌లోని సబ్‌స్టేషన్



పాశమైలారం పరిశ్రమల్లో కొత్తగా తెచ్చుకున్న జనరేటర్లు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 28: అప్రకటిత విద్యుత్ కోతలు పరిశ్రమల వర్గాలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మరమ్మతులు, ఇతరత్రా కారణాలు చెబుతూ పరిశ్రమలకు విద్యుత్ సరఫరా తరుచూ నిలిచిపోతుండడంతో ఉత్పత్తులపై ప్రభావం చూపుతున్నది. దీంతో మళ్లీ జనరేటర్లను ఆశ్రయిస్తున్నారు పరిశ్రమల యాజమాన్యాలు. ఏ పరిశ్రమ చూసినా ఇప్పుడు జనరేటర్లు కొనే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే కొన్ని పరిశ్రమల్లో కొత్త జనరేటర్లు బిగింపబడ్డాయి. పదేండ్లుగా జనరేటర్ల అవసరం పడని చిన్న పరిశ్రమలు తమ పరిశ్రమలో స్థలం లేక ఆరుబయట రోడ్ల పక్కన పెట్టుకుంటున్నాయి. మండు వేసవిలో డిమాండ్‌కు తగ్గట్టుగా కరెంటు సరఫరా కావడం లేదు. డిమాండ్‌కు, సరఫరాకు ప్రభుత్వం సరైన కసరత్తు చేయకపోవడంతో పరిశ్రమల పాలిట శాపంగా మారుతున్నది. ఇప్పటికే ఇస్నాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పాశమైలారం పారిశ్రామిక వాడ అప్రకటిత విద్యుత్ కోతలను చవిచూస్తున్నది. దీనివల్ల పరిశ్రమలపై ఆర్థిక భారం పడుతున్నది. నిరంతర విద్యుత్ ఉంటేనే బాయిలర్లు నడుస్తాయి. కరెంట్ కోతలతో బాయిలర్లలో వేడి తగ్గిపోయి ప్రొడక్ట్ దెబ్బతింటుంది. అప్రకటిత విద్యుత్‌కోతలతో ఒప్పుకున్న ఆర్డర్లు సకాలంలో పరిశ్రమలు పూర్తిచేయలేక పోతున్నాయి. విద్యుత్ సరఫరా సరిగ్గా లేక చాలా పరిశ్రమలు తమ ఉత్పత్తిని తగ్గించుకుంటున్నట్లు తెలిసింది.

### తొమ్మిదేండ్లు స్వర్ణయుగం...

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో 46,623 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 358 పరిశ్రమల కనెక్షన్లు, 39,863 డొమెస్టిక్ కనెక్షన్లు, కమర్షియల్ కనెక్షన్లు 4,906, అగ్రికల్చర్ కనెక్షన్లు 925,హెటీ సర్వీసు 250 కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో అత్యంత ప్రధానమైనవి పరిశ్రమల కనెక్షన్లు. 358 పరిశ్రమల్లో నిరంతరం ఉత్పత్తులు తీస్తున్నారు. చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఉన్నాయి. దాదాపు 150 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఇక్కడ ఉంది. పాశమైలారంలో 3 సబ్‌స్టేషన్లు, వివిధ గ్రామాల్లో మరో మూడు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. దాదాపు 70వేల మంది కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా పాశమైలారం, ఇస్నాపూర్, రుద్రారం, ముత్తంగి పరిశ్రమల్లో ఉపాధి పొందుతున్నారు. మూడు షిఫ్టులు పరిశ్రమలు నడుస్తుండడంతో ఎవరి ఉపాధికి ఢోకా లేదు. బీఆర్ఎస్ హయాంలో తొమ్మిదేండ్లు పరిశ్రమలకు నాణ్యమైన కరెంటు అప్పటి ప్రభుత్వం సరఫరా చేసింది. నిరంతరం నాణ్యమైన, కోతలు లేని విద్యుత్‌ను సరఫరా చేయడంతో పరిశ్రమలు స్వర్ణయుగాన్ని చూశాయి. దేశంలోనే అత్యధిక జీడీపీని ఇస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణను అగ్రస్థానంలో నిలిచేలా పరిశ్రమలు తోడ్పాటును అందించాయి. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ కాంతులతో తెలంగాణ జిగేల్‌మంటూ అన్నిరంగాల్లో దూసుకుపోయింది. ఇప్పుడు ఆ పరిస్థితికి కాలం చెల్లేలా ఉంది. పరిశ్రమల్లో మళ్లీ నాటి సమైక్య పరిపాలన రోజులు యాదికొస్తున్నాయి. వారంలో రెండు, మూడు రోజుల పవర్ హాలీడేలు పునరావృతం అవుతాయా..? అనే సంశయం పారిశ్రామికవేత్తల్లో నెలకొన్నది. ఎందుకైనా మంచిదని పరిశ్రమలు ఇప్పుడు విద్యుత్ జనరేటర్లను కొంటున్నాయి. ఈ ఏడాది జనరేటర్ల కొనుగోలు రెట్టింపు అయ్యిందని సమాచారం. కొన్నేండ్లుగా వాడుకలో లేని జనరేటర్లను పరిశ్రమలు తిరిగి మరమ్మతులు చేయిస్తున్నాయి. కొన్ని చిన్నతరహా పరిశ్రమలు విద్యుత్ కోతలు ఇక ఉండవని వాటి పరిశ్రమలో జనరేటర్ల ఏర్పాటుకు స్థలం కూడా వదల్లేదు. ఇప్పుడు జనరేటర్లను కొని పరిశ్రమ బయట రోడ్డుపక్కన పెట్టుకుంటున్నాయి.

### నమ్మకం లేకనే ఆర్డర్లు..

పాశమైలారంలోని చాలా పరిశ్రమల యాజమాన్యాలు గత ఆగస్టు నుంచే జనరేటర్లను బుక్ చేసుకున్నాయి. వారి అనుమానం నిజం అన్నట్టుగానే ఈ ఫిబ్రవరి నుంచే పరిశ్రమలకు అప్రకటిత విద్యుత్ కోతలు ప్రారంభమయ్యాయి. మరమ్మతుల పేరున, ఫీజులు పోయాయని, ఇతర కారణాలు చెబుతూ తరుచుగా విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేస్తున్నారు. విద్యుత్ కోతలను ముందే ఊహించిన పలు పరిశ్రమల యాజమాన్యాలు జనరేటర్లను బుక్ చేసుకున్నాయి. ఇప్పటికే ఆర్డర్లు ఫుల్ ఉన్న పరిశ్రమలు ప్రత్యామ్నాయంగా జనరేటర్లను తెచ్చుకున్నాయి. జనరేటర్ల ద్వారా యూనిట్ విద్యుత్ ఖర్చు దాదాపు రూ. 20 అవుతుంది. అదే విద్యుత్‌శాఖ ఇచ్చే పవర్‌కు రూ.8 వరకు అవుతుంది. జనరేటర్లతో యూనిట్‌కు రూ. 12 అదనపు ఖర్చు అవుతున్నా ఆర్డర్లు కావద్దనే ఉద్దేశంతో పరిశ్రమలు జనరేటర్లను ఆర్డర్లు ఇస్తున్నాయి. క్యాస్టింగ్ పరిశ్రమలపై, బాయిలర్ వాడే పరిశ్రమల్లో అప్రకటిత విద్యుత్ కోతలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. పవర్‌కట్ కారణంగా ఉత్పత్తులపై ప్రభావం పడుతున్నది. మేలో పవర్ హాలిడే లు తప్పక పోవచ్చని పారిశ్రామికవేత్తలు ఊహిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యమైన కరెంట్ సరఫరాతో ధీమాగా ఉన్న పరిశ్రమలు, ఇప్పుడు కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నాయి. మళ్లీ పాతరోజులను గుర్తు చేసుకుని బెంగపెట్టుకున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పరిశ్రమలకు నిరంతర విద్యుత్ అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని పరిశ్రమల వర్గాలు కోరుతున్నాయి.

## గులాబీ దండులో ఫుల్ జోష్

- మండుటెండల్లోనూ రజజోత్సవ సభ విజయవంతం
- ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి భారీగా వెళ్లి సత్తాచాటిన శ్రేణులు
- యాదికొచ్చిన ఉద్యమం నాటి రోజులు
- ప్రభుత్వంపై కోపంతో తరలివచ్చిన అన్నివర్గాల ప్రజలు
- ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులకు హరీశ్‌రావు కృతజ్ఞతలు

సిద్దిపేట, ఏప్రిల్ 28( నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రజతోత్సవ సభ విజయవంతం కావడంతో గులాబీ దండులో ఫుల్‌జోష్ నెలకొంది. మండుటెండను సైతం లెక్కచేయకుండా లక్షలాదిగా బీఆర్ఎస్ శ్రేణులు, అన్నివర్గాల ప్రజలు సభకు పోటెత్తారు. దీంతో జన జాతరను తలపించింది. సిద్దిపేట–హన్మకొండ రహదారి ఆదివారం పూర్తిగా జనంతో నిండిపోయిన సంగతి తెలిసిందే.కాంగ్రెస్ పాలనపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడడంతో ప్రజలు పనులు సైతం పక్కన పెట్టి సభకు వచ్చారు. మళ్లీ కేసీఆర్ సార్ సీఎం కావాలని ప్రజలు నినదించారు.కేసీఆర్ సార్ వస్తేనే తమ బతుకులు బాగు పడుతాయని సబ్బండ వర్గాల ప్రజలు విశ్వసిస్తున్నారు అనడానికి రజతోత్సవ సభకు వచ్చిన జనమే నిదర్శనంగా చెప్పవచ్చు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి లక్ష్యానికి మించి జనం వెళ్లారు. ప్రతి పక్షంలో ఉన్న పార్టీ సభకు ఇంత పెద్ద ఎత్తున జనం తరలివెళ్లడం మామూలు విషయం కాదంటూ ప్రజలు చర్చించుకున్నారు.

### యాదికొచ్చిన ఉద్యమం నాటి రోజులు..

రజతోత్సవ సభ ఉద్యమ నాటి రోజులను గుర్తుకు తెచ్చింది. ఏ తొవ్వ చూసినా జన ప్రవాహం కనిపించింది. బస్సులు, లారీలు, డీసీఎంలు, కార్లు, జీపులు, బైకులు..ఇలా లెక్కకు మించిన వాహనాలతో రోడ్డు కిక్కిరిసిపోయి ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడింది. సిద్దిపేట –హన్మకొండ రహదారి గుండా ఎల్కతుర్తికి వెళ్లే వాహనాలతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హుస్నాబాద్ దాటిన తర్వాత కారు ఆపి స్వయంగా ట్రాఫిక్ క్లియర్ చేసి వాహనాలను పంపించారు. సిద్దిపేట రంగధాంపల్లి చౌరస్తా వద్ద, బాబుజగ్జీవన్ కూడలి వద్ద స్వయంగా బీఆర్ఎస్ నేతలు ట్రాఫిక్‌ను క్లియర్ చేసి వాహనాలను ఎల్కతుర్తి సభకు పంపించారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు బీఆర్ఎస్ నేతలు సిద్దిపేట మున్సిపల్ ఛైర్మన్ కడవేర్గు రాజనర్సు, నేతలు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, వంగ తిరుమల్ రెడ్డి ఇతర బీఆర్ఎస్ నేతలు దగ్గర ఉండి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఐదారు గంటలు ఎండను సైతం లెక్క చేయకుండా వారు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అడుగడుగునా పోలీసులు అడ్డంకులు సృష్టించారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంలో పోలీసులు పూర్తిగా చేతులెత్తేశారు. ఒకరిద్దరు ట్రాఫిక్ పోలీసులు మాత్రమే అక్కడే ఉన్నారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల నుంచి వచ్చిన జనం రజతోత్సవ సభా స్థలికి చేరుకోలేక పోయారు.వారంతా హుస్నాబాద్ నుంచి తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ మార్గం గుండా పోయిన దాదాపుగా రెండు లక్షలకు పైగా జనం సభకు వెళ్లకుండానే తిరుగు పయనం అయ్యారు.

### అందరికీ ధన్యవాదాలు ..



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు హృదయ పూర్వక ధన్యవాదాలు. సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుట్టింది. అడుగడుగునా పోలీసుల ఆంక్షలు, నిర్బంధాలు ప్రయోగించింది ఈ దుర్మార్గ సర్కారు. సభా స్థలికి కార్యకర్తలు చేరకుండా 15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ చేశారు. కరీంనగర్, సిద్దిపేట, హుస్నాబాద్ దారుల్లో వచ్చే వాహనాలను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ట్రాఫిక్ జాం పేరిట సాక్షాత్తు పోలీసులే దగ్గరుండి వందలాది వాహనాలను తిప్పి పంపారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల నుంచి వచ్చే దాదాపు1000 పైగా వాహనాలను హుస్నాబాద్ దాటిన తర్వాత కొత్తపల్లి నుంచి యూటర్న్ చేసి తిరిగి సిద్దిపేట వైపు మళ్లించారు. కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పటాపంచలు చేశారు. సభను విజయవంతం చేసిన బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు, టీవీల్లో లక్షల సంఖ్యలో వీక్షించిన వారందరికీ ధన్యవాదాలు.

**– తన్నీరు హరీశ్‌రావు,మాజీ మంత్రి**

## భూభారతితో భూసమస్యలు పరిష్కారం



వర్గల్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న మంత్రులు

వర్గల్, ఏప్రిల్ 28 : పెండింగ్ భూసమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టం– 2025 ను అందుబాటులోకి తెచ్చిందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం శాకారంలో జరిగిన భూభారతి చట్టం 2025 అవగాహన సదస్సులో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భూభారతి చట్టంలో సాదాబైనామాలకు పరిష్కారం చూపనున్నట్టు తెలిపారు. ఆయా అంశాలకు సంబంధించి భూ సమస్యలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరిస్తామని తెలిపారు. రైతుల భూసమస్యల విషయంలో అధికారులు ఆలస్యం చేసినా, అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను మంత్రులు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి,మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, గజ్వేల్, వంటిమామిడి మార్కెట్ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, విజయ, నాయకులు ఎలక్షన్ రెడ్డి,భూంరెడ్డి , నిమ్మరంగారెడ్డి, రైతులు , నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేసీఆర్‌పై మంత్రులవి పిచ్చి ప్రేలాపనలు

- శాఖలపై పట్టులేక విమర్శలు చేస్తున్న మంత్రులు
- ఆరు నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలులేవు
- రజతోత్సవ సభ విజయవంతం చేసిన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు
- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్‌లో మీడియాతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 28: రాష్ట్రమంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు వారి శాఖలనే సరిగ్గా నిర్వర్తించలేక పోతున్నారని, వారికి పాలనపై పట్టులేదని, వాళ్లు కేసీఆర్‌పై పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ను విమర్శించే నైతికత ,అర్హత మంత్రులకు లేదన్నారు. కేసీఆర్ కాలి గోటికి వారు సరిపోరని, మిమ్మల్ని ప్రజలే తిరస్కరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ప్రజలకు తాగు నీళ్లు, కరెంట్, కల్యాణలక్ష్మి చెక్కులను అందించడంలో విఫలమమైందన్నారు. రాష్ట్రంలో ఆరు నెలలుగా గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతనాలు రావడం లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీలను అమలు చేసి చూపాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీల అమలు, అభివృద్ధిపై దృష్టిసారించాలని హితవు పలికారు. మంత్రులు రాజకీయంగా అవగాహన లేక మాట్లాడుతున్నారని, దేశంలోని ప్రతి రాజకీయ పార్టీకి పండింగ్ ఉంటుందనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. మంత్రులు వ్యాపారం మాని ప్రజలకు సేవ చేయాలని హితవు పలికారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివచ్చి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 10లక్షల పైచిలుకు మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడంతో సభ విజయవంతమైందన్నారుజ ఈ సభతో ప్రభుత్వానికి కనువిప్పు కావాలని వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు.

**మంత్రి సమయం ఇవ్వక చెక్కుల పెండింగ్...**

గజ్వేల్ నియోజకవర్గానికి సంబంధించిన 826 కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేపట్టాలని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తే, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ సమయం ఇస్తే పంపిణీ చేస్తామని చెబుతున్నారని, ఇన్‌చార్జి మంత్రి గజ్వేల్ నియోజకవర్గ ఆడబిడ్డల కోసం ఒకరోజు సమయం ఇచ్చి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయాలని వంటేరు ప్రతాప్‌రెడ్డి కోరారు. బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గానికి మంజూరైన రూ.184 కోట్ల నిధులను వెంటనే విడుదల చేసి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఆర్అండ్ఆర్ బాధితుల పక్షాన నిరాహార దీక్ష చేసిన రేవంత్‌రెడ్డి వారికి ప్రభుత్వం నుంచి ప్యాకేజీ విడుదల చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్సీ రాజమౌళి, మధు, నాయకులు నవాజ్‌మీరా, గో పాల్‌రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, మల్లేశం, నాయకులు విరాజత్ అలీ, రాజిరెడ్డి, ఆకుల దేవేందర్, భూపాల్‌రెడ్డి, స్వామిచారి, అహ్మద్ పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 28 : మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం జమ్లానాయక్ తండాలో బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు నాగరాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ అడ్డుకున్నారు. సోమవారం బాలిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించి కౌన్సిలింగ్ బాల్య వివాహాలు జరిపించకూడదని, వాటితో అనేక నష్టాలు జరుగుతాయని వివరించారు. బాల్య వివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాతలోతు గోపాల్, శాంతి దంపతుల పెద్ద కుమార్తె (13)కు ఇటీవల పాపన్నపేట మండలానికి చెందిన యువకుడితో నిశ్చితార్థం చేశారు. అధికారులు తండాలో పర్యటించి వివాహం జరిపిస్తే కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. వివాహం జరపమని తల్లిదండ్రుల నుంచి హామీ పత్రాన్ని తీసుకున్నారు.



బాల్యవివాహం చేయమని తల్లిదండ్రుల నుంచి హామీపత్రం తీసుకుంటున్న ఐసీడీఎస్ అధికారులు

## బీవీఆర్‌ఐటీకి కెనడా ప్రొఫెసర్ ప్రశంసలు

నర్సాపూర్, ఏప్రిల్ 28: నర్సాపూర్‌లోని బీవీఆర్‌ఐటీ కళాశాలను కెనడాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ న్యూ బ్రన్స్‌విక్ ప్రొఫెసర్ కెన్నెత్ బి కెంట్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆపరేటింగ్ సిస్టమ్‌లో గార్బేజ్ కలెక్షన్ (జీసీ), స్వయంచాలకంగా మెమోరీ అలొకేషన్, డీ–అలొకేషన్ ఎలా నిర్వహిస్తుందో వివరంగా తెలిపారు. జావా C++ ప్రోగ్రామింగ్ భాషలు గార్బేజ్ కలెక్షన్‌ను ఎలా నిర్వహిస్తాయో విశ్లేషించారు. బీవీఆర్‌ఐటీ కళాశాలలో నాణ్యమైన బోధన అందుతున్నదని ఆయన ప్రశంసించారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు మంచిస్థానాల్లో ఉన్నట్లు తెలుసుకుని అభినందనలు తెలిపారు. అనంతరం ఇండస్ట్రీ రిలేషన్స్ డైరెక్టర్ పరుచూరి సతీశ్ చంద్ర మాట్లాడుతూ ఇప్పటివరకు బీవీఆర్‌ఐటీ నుంచి 27 మందికిపైగా విద్యార్థులు యూఎన్‌బీలో ఉన్నత విద్య కొనసాగించారన్నారు. వీరిలో చాలా మంది కో–ఆప్ ప్రోగ్రామ్‌ను ఎంపిక చేసుకున్నారన్నారు. ప్రస్తుత విద్యార్థులు కూడా ఈ అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ బీవీఆర్‌ఐటీ, యూఎన్‌బీ మధ్య ఉన్న బలమైన సంబంధాన్ని, మౌలిక ఒప్పందాన్ని (ఎంవోయూ) ప్రస్తావించారు. విద్యార్థులు ప్రొఫెసర్ కెంట్ ఇచ్చిన అమూల్యమైన సూచనలు స్వీకరించి భవిష్యత్తులో మంచి విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బంగార్రాజు, మేనేజర్ బాపిరాజు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ కెన్నెత్ బి కెంట్‌కు స్వాగతం పలుకుతున్న కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్

## హుస్నాబాద్‌ను అన్నింటా ముందుంచేందుకు కృషి




హుస్నాబాద్ మున్సిపల్ మాజీచైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్నను సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**బీసీసంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్**

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 28: హుస్నాబాద్ పట్టణాన్ని అన్నింటా ముందుంచేందుకు కృషిచేస్తానని బీసీసంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సోమవారం రాత్రి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ మాజీ పాలకవర్గ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గౌరవెల్లి రిజర్వాయర్ భూసేకరణ కోసం నిధులు కేటాయించడం జరిగిందని, కాల్వల పనులు సైతం జరుగుతున్నాయని చెప్పారు. హుస్నాబాద్‌కు ఇంజినీరింగ్ కళాశాలను సైతం తీసుకురావడం జరిగిందని, పరిశ్రమలతో పాటు పలు విద్య, వైద్య సదుపాయాలను సైతం కల్పించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామని, ప్లాస్టిక్‌నివారణ కోసం స్టీల్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. డ్రగ్స్‌ను అరికట్టేందుకు కృషిచేయాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండోచైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న, మాజీ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్,పలువురు మాజీకౌన్సిలర్లు పాల్గొన్నారు.


## కబ్జాల నుంచి ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

- బీరంగూడ గ్రామస్తుల విజ్ఞప్తి

అమీన్‌పూర్,ఏప్రిల్ 28 : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో సర్వేనంబర్ 993 ప్రభుత్వ స్థలం పెద్ద ఎత్తున కబ్జాలకు గురవుతున్నట్లు తెలుసుకొని అమీన్‌పూర్ అఖిలపక్ష నాయకులు, గ్రామస్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు సోమవారం ఆ స్థలాలను పరిశీలించారు.అనంతరం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహ్మాగౌడ్, మాజీ కౌన్సిలర్ ఎండ్ల రమేశ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు అదెల్లి రవీందర్ మాట్లాడుతూ.. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో వేల కోట్ల రూపాయల విలువ చేసే భూములు అన్యాక్రాంతం అయ్యాయని అవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ స్థలాల పక్కన ప్రైవేట్ స్థలాల సర్వేనంబర్ల రిజిస్ట్రేషన్లు వేసుకొని రూ.కోట్ల విలువ గల భూములను కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమ రిజిస్ట్రేషన్లు,నిర్మాణాలపై అధికారుల అవినీతి, అలసత్వం ఉందని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు మొద్దునిద్ర వీడి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు. అనంతరం తహసీల్ కార్యాలయానికి వెళ్లి ప్రభుత్వ భూములు కాపాడాలని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. బీరంగూడ ఆలయం వద్ద రహదారి పక్కనే ఉన్న రూ.20 కోట్ల విలువైన సుమారు 5వేల గజాల స్థలం కబ్జాను కాపాడి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నందారం రమేశ్‌గౌడ్, శ్రీనివాస్, మల్లేశ్, జ్ఞానేశ్వర్, ఇంద్రేశం ప్రకాశ్ పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న బీరంగూడ గ్రామస్తులు, అఖిలపక్ష నాయకులు



అమీన్‌పూర్ తహసీల్ అధికారికి వినతిపత్రం అందచేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు